# స్మిత యోగులు

నేనే అంకుల్ - రామూన్ని' అన్నాడు చెట్టంత మనిషి ఎదురుగా నిలిచి మల్లెల్లాటి తెల్లటి దుస్తుల్లో ఉన్నాడు. దగ్గరగా కత్తిరించుకున్న మిలిటరీ క్రాఫింగ్, అందమైన చిరునవ్వు. గౌరయ్య కొడుకు శ్రీరాం అని గుర్తించడానికి ఒక నిమిషం పట్టింది కూర్చోమన్నాను.

"' వచ్చేనెల మీరు బరైలీ వస్తున్నారట కదా " అన్నాడు

" నీకెలా తెలుసు ?" అన్నాను

" మీ శ్రీను చెప్పాడు "

"అదేమిటి మీరిద్దరూ బరైలీలోనే ఉంటున్నారా ?" ఆశ్చర్యంగా అడిగాను.

' నేను పిథోరాఘఢ్‌కి నేపాలుకి మధ్య ఉంటున్నాను. ఈ మధ్యనే అనుకోకుండా మేం టణక్‌పూర్‌లో కలిశాం.

నాకెంతో సంతోషం అనిపించింది." అయితే నువ్వు కుమావ్ ప్రాంతంలో ఉంటున్నావన్నమాట, ప్రకృతి అందాలకేం లోటు. జిమ్‌కార్బెట్ పుస్తకాల్లో కళ్లకు కట్టినట్లు చిత్రించేవాడు –" అన్నాను.

శ్రీరాం ఉరఫ్ రామం నావేపూ, అప్పుడే ఇద్దరికీ కాఫీ తీసుకువస్తున్న కమల వేపూ చూస్తూ–

" మీతోపాటే మానాన్నని బరైలీదాకా తీసుకురావాలి. అక్కడి నుండి నేను తీసుకువెళ్ళే ఏర్పాటు చేసుకుంటాను. మీరూ అంటే కూడా వద్దురుగాని, ఈ ఏర్పాటు గురించి నేనప్పుడే శ్రీనుతో కూడా మాట్లాడాను "అన్నాడు ఉత్సాహంగా.

" మీ నాన్నను కదిపి తీసుకు రావడం నాతరమా "అని నేను చిన్నగా నవ్వుతూ వుంటే,

" మా తాత పోయాక మరీ ఒంటరి అయిపోయాడు. ఊరికే ఉండక ఇరుగుపొరుగులతో చిన్న విషయాలకే జగడాలు, రిటైర్ అయ్యాక చాదస్తం ఎక్కువైంది. మీరు ఎలాగైనా తీసుకొస్తే కొంత మార్పు ఉంటుంది."

అలా వాసంత సమీరంలా వచ్చి తియ్యగా మాట్లాడి వెళ్లిన శ్రీరాంని చూస్తూ వుంటే ఆరేళ్ళ క్రితం ఒక జడివానలా, సుడిగాలిలా వచ్చి నామీద విరుచుకుపడ్డ గౌరయ్య చేసిన దాడి జ్ఞాపకానికి వచ్చింది.

అప్పటికి నేనైతే రిటైర్ అయ్యాను. కానీ ఇంకా గౌరయ్య ఉద్యోగవిరమణ చెయ్యలేదు. నేను ఇంట్లో కూర్చుని వార్తాపత్రిక చదువుకుంటున్నాను.

" చూశావా నీ కొడుకేం చేశాడో, వాడు ఆర్మీలోకి వెళ్తేవెళ్లాడు కానీ మా వాణ్ణి కూడాలాక్కుపోయాడు. ఇదేమైనా బావుందా ?" అన్నాడు. దానికంతటికీ నాదే బాధ్యత అన్నట్లు తీవ్రంగా చూస్తూ

"నేను మాత్రం మా శ్రీనుని సైన్యంలో చేరమని పంపానా ? పిల్లలు పెద్దవాళ్ళయ్యాక మన చేతిలో ఉంటారా ? వాళ్ల జీవితం, భవిష్యత్తూ వాళ్ళది" అన్నాను.

రుసరుసలాడుతూ వెళ్ళిపోయాడు గౌరయ్య. కాలం కాస్తో కూస్తో మార్పు మానవ స్వభావంలో తెస్తుంది కానీ గౌరయ్య విషయంలో అది ఏం చెయ్యలేకపోయింది.

సుమారు మూడువేలమంది ఉద్యోగులున్న పెద్ద కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో అతడూ నాలాగే ఒక ఉద్యోగి. తొలి రోజుల్లో కేవలం ముఖపరిచయమే. అయితే క్యాంటీన్‌లో టీ తాగుతున్నప్పుడుగానీ,వేరెక్కడ కానీ క్షణం తీరిక లేనట్టు కనపడేవాడు. సిగరెట్టు మీద సిగరెట్టు ముట్టించేవాడు.ఉద్యోగుల సంఘంలోనో, కోఅపరేటివ్ బాంక్ ఎన్నికల్లోనో తరచూ నిలబడి ఓడిపోయేవాడు . తరువాత కాస్త మా పరిచయం పెరిగింది. సాధారణంగా తెలిసిన వారెవరైనా ఎదురైతే బావున్నావా ? అని పలుకరిస్తాం . ప్రతి స్పందనగా బావున్నాననో, మీరు బావున్నారా అనో కనీసం ఒక చిరునవ్వైనా సమాధానం వస్తుంది, గౌరయ్య నవ్వడం నే చూడలేదు సరికదా ' ఏం బాగు ' అంటూ ఏదో ఈతి బాధలు వెలకపోసేవాడు.నొసలు ముడుత పడేది.

ఆ తర్వాత కొన్నాళ్ళకు మేమిద్దరం ఒకే శాఖలో పనిచేసే సందర్భంలో ఒకసారి ప్రభుత్వ కార్యాలయాల్లో లెక్కలు తనిఖీ చేసే జట్టుగా భాగ్యనగరం విడిచి ఊళ్ళ మీదకు వెళ్ళవలసి వచ్చింది. విధిగా ఒకే బస్‌లో నివసించడం కలిసి మెలసి పని చెయ్యడం అనివార్యం అయింది. ఒక్కోసారి అతి చిన్న ఊళ్లలో పని పడేది. సాయంత్రం ఏమీ తోచక అలా చల్లగాలి పీల్చుకుని రావడానికి ఊరి బయటకు వెళ్లేవాళ్లం. ఊరి పొలిమేరలకు వెళ్లి ఏదైనా రాతి మీదనో పొలంగట్టునో కూర్చుని సూర్యాస్తమయాన్ని చూస్తూ, పక్షుల బారులు తీరి ఆకాశ మార్గాన పోతూ వుంటే వాటిని చూస్తూ

గడుపుదామంటే , లేచి వెళ్ళిపోదాం అని నస పెట్టేవాడు.స్థిమితంగా ఐదు నిముషాలైనా ఒక దగ్గర కూర్చునే కుదురుబాటు ఉండేది కాదు. ఒకసారి ఊరుకోలేక ఏం తొందర ఇంకో పది నిముషాలు కూర్చుని పోదాం అన్నాను. "అసురసంజవేళ దుష్టశక్తులు తిరుగాడుతూ వుంటాయి. మనం ఉన్నది ఊరుకాని ఊరు" అన్నాడు.

ఒక సారి ఏదో ఊళ్ళో ఇనస్పెక్షన్ బంగళాలో ఒక భాగం మాకు ఇచ్చారు.సాయంత్రం కావస్తోంది. ప్రయాణ బడలికతో ఫాన్ క్రింద కుర్చీలో కూర్చున్నాను. ఏదో సమస్యలో ఉన్నట్టు నావేపు చూసి "తూర్పు ఎటు" అని అడిగాడు. ఆప్రశ్న ఎందుకో అర్థంకాక,అస్తమిస్తున్న సూర్యుడి వాలుచూసి ఆ దిశకు ఎదురుగా వున్న వేపు చూపించాను. " ఇటు ఉత్తరం అన్నమాట" అంటూ తన ఎడమచేతి వేపు చూసి " కాస్త ఈ మంచం అటు మారుద్దాం,సాయం పట్టు. ఆ కుర్చీలు ఇటు పెడదాం అన్నాడు." వాచ్‌మన్ ఎక్కడకో వెళ్లినట్టున్నాడు, వచ్చాక కావలసిన మార్పులు చేసుకుందూగాని , అయినా రెండు రోజులుండిపోయేవాళ్లం. ఈ మార్పులన్నీ ఎందుకూ? అన్నాను. నావేపు అసహనంగా చూసి తానొక్కడే బరువైన మంచాన్ని ఎత్తబోతూ వుంటే నే లేచి వెళ్ళి ఆ బరువును అతడితో పంచుకున్నాను.

ఉధయాన్నే నేను కాస్తవేగం నిద్రలేచి నామంచం మీద కూర్చునేవాడిని, కొంతసేపటికితానూ లేచి అరచేతిలో వ్రేలితో ఏదో వ్రాసుకుని కళ్ళకి అద్దుకుని చుట్టూ ప్రపంచాన్ని చూసేవాడు. ఒక రోజు అలా అరచేతిలో వ్రాసుకోకుండానే తన దృష్టి పొరపాటున నా మీద పడింది. ఆరోజంతా ఀసంతృప్తిగానూ పరధ్యానంగానూ ఉన్నాడు, దానికి నేనే కారణమైనందున ఒక అపరాధిలా బాధపడ్డాను.ఇంకో సాయంత్రం బంగళా వెనుక వరండాలో కూర్చుని ట్రాన్సిస్టర్‌లో శ్రావ్యంగా వస్తున్న పాట వింటున్నాను. కాసింత దూరాన బట్టలు అరవేసుకునే తీగ మీద ఒక గుడ్లగూబ వాలింది. అటు చూస్తూనే ఒళ్లు జలదరించినట్టు కుర్చీలోంచి లేచి నిలుచున్నాడు. మొహంలో ఏదో కలవరం. "గుడ్లగూబ వ్రాలడం ఎంతో అశుభం. నువ్వు నమ్మవా ఏమిటి ?" అని అనగా పొరపాటున చిన్నగా నవ్వాను. విశ్రాంతి బంగళాలు ఊరి వెలుపలే ఉంటాయి. ఆ పక్షి వ్రాలడం నాకు అసహజంగా అనిపించలేదు.. నవ్వడమే నే చేసిన అపరాధం. నావేపు ఓ ప్రమాదకరమైన వాణ్ణి చూసినట్టుగా ఓర గంట చూశాడు.

ఇంకో ఊరు వెళ్ళినప్పుడు " నీకు తెలుసునో లేదో ఇక్కడ జోస్యం చెప్పగల యోగిని ఉంది, వెళ్ళివద్దామా " అన్నాడు. నేను సరే అని తల ఊపలేకపోవడంతో మా మధ్య దూరం పెరిగింది.నాతో కలిసిమెలసి ఉన్నా గంభీర ముద్రవేసుకునేవాడు. అలా దగ్గరగానే ఉంటూ ఇద్దరం దూరం

జరుగుతున్నట్లనిపించింది. ఇక మనసు విప్పి అనుభవాలు కలపోసుకుని ఆనందంగా మాట్లాడుకోవడం ఎక్కడ ? కలసి భోజనం చేస్తున్న సమయంలో టేబిల్ గజగజ ఊగిపోయేది. కాళ్ళు ఊపుతూ ఏదో ఆలోచిస్తూ అన్యమనస్కంగా భోజనం ముగించేవాడు. రైలు ప్రయాణీకుడు ఏదో మధ్యస్థంగా స్టేషన్ ప్లాట్‌ఫామ్ మీద దిగి వేడివేడి తేనీరు చురుకుచురుకున నోటపోసుకుంటూ రైలుబండి ఎప్పుడు కదిలిపోతుందో అని ఒక కంట కనిపెడుతూ అశాంతిగా ఉన్నట్టే హడావిడి పడుతూ భోజనం ముగించేవాడు. ఇలా నిత్యం ఏదో అశాంతో భయమో తన జీవితాన్ని శాసిస్తున్నట్లు నాకు తోచేది.

అలా మూడు నెలలు గడిచాక అతడింకో తనిఖీ పార్టీలోకి వెళ్ళిపోవడం తటస్థించింది. యాదృచ్ఛికంగా ఆ మార్పు జరిగిందో లేక అతడే ప్రయత్నించాడో నాకు తెలియకున్నా ఉపశమనం దొరికి ఉంటుంది అని ఊహించాను. ఇక మా ఇద్దరికీ మధ్య స్నేహం చిక్కపడలేదు. అతని నివాసమెక్కడో కూడా అప్పటికి నాకు తెలియదు. నేను గౌరయ్యకన్నా రెండేళ్ళు ముందే రిటైర్ అయ్యాను. మా శ్రీను చదువుముగించి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఒక రోజు ఎవడో యువకుణ్ణి ఇంటికి తెచ్చి "ఇతడూ నేను చదివిన కాలేజీలోనే చదువుతున్నాడు పేరు శ్రీరామ్. నా పుస్తకాలు కావాలని ఇలా వచ్చాడు. వీళ్ళనాన్నగారు కూడా మీ ఆఫీసులోనే పని చేస్తున్నారట " అంటూ నాకూ కమలకూ పరిచయం చేశాడు." ఈ మధ్యనే ఇక్కడికి దగ్గరగా ఇల్లు కూడా కొనుక్కున్నారట. అని కూడా చెప్పాడు. అలా మళ్లా నాకూ గౌరయ్యకూ మధ్య మా పిల్లలు వారధి కట్టారు. ఎంతో కలివిడిగా మా మధ్య కూర్చుని మాట్లాడుతున్న శ్రీరాం ఉరఫ్ రామాన్ని ఆశ్చర్యాన్నీ సంతోషాన్నీ మేళవించి మరీ చూశాను. ఆ కుర్రాడి నవ్వులో ఏదో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్నది. పిల్లల మధ్య రాకపోకలుండేవి.

ఒక ఉదయంనే వీథి దగ్గర వార్తా పత్రిక కోసం ఎదురు చూస్తూ నిలుచున్నాను. అరమగ్గిన జాంపండు లాటి వయోవృద్ధుడు నా ఇంటిగోడకున్న సైన్‌బోర్డు కళ్ళజోడు సవరించుకుంటూ నిశితంగా చూస్తున్నాడు. ఏదో ఇల్లువెతుక్కుంటున్నాడేమో అనుకుని మీకెవరు కావాలనినే అడిగాను.

" ఉదయం అలా నాలుగడుగులు వేస్తూ వుంటాను. నా మనవడు రామం మీ పేరు తరచుగా వినిపిస్తూ వుంటాడు" అంటూ తనని పరిచయం చేసుకున్నాడు. అలా క్రమంగా మా ఇళ్ల మధ్య ఇంకో బంధం కొత్తగా ఏర్పడి బిగిసింది. తరచూ కలవడం పలకరింపులూ జరిగాయి. ఇద్దరం మా మధ్య వయో భేదం ఉన్నా అవలీలగా ఎన్నో విషయాలు మాట్లాడుకునే వాళ్ళం ఏది చెప్పినా

సున్నితమైన హాస్యాన్ని జోడించి చిరునవ్వు మెరిపించేవాడు. పళ్ళు ఊడిన బోసి నవ్వులో ఏదో ఆకర్షణ.

గౌరయ్య పదవీ విరమణ జరిగినాక కొత్త సమస్య రానే వచ్చింది. "ఇక్కడ అందరినీ కలిపి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పెడదాం" ' ఏమంటావు ' అన్నాడు. నేనంత ఉత్సాహం చూపకపోవడంతో గౌరయ్య నొసట ముడుతలు పడ్డాయి. అలాటి సందర్భంలో తండ్రికీ కొడుక్కీ ఉన్న భేదం స్పష్టంగా కనపడి నన్ను ఆశ్చర్యంలో ముంచేది.

ఉన్నట్టుండి ఒక రాత్రి గౌరయ్య తండ్రి ప్రశాంతంగా దీర్ఘనిద్రలోకి జారుకున్నాడని వినగానే మర్నాడు ఉదయాన్నే వెళ్లి చూశాను. చీకూ, చింతా, భయం ఉద్వేగం లేని చిరునవ్వుతో నిద్రించినట్లున్నాడు. సాగర సంగమానికి ముందు స్థిమితంగా సాగుతున్న మహానదిలా ఉన్నాడు. సూర్యోదయ సూర్యాస్తమయాలూ జనన మరణాలూ సహజపరిణామాలన్న ఎరుకను జీర్ణించుకున్న నవ్వు అది. అలా వృద్ధుడు నిష్క్రమించాక, రెండు ఇళ్ళలోని పిల్లలూ సైనికాధికారులుగా ఎదిగి దేశమ్మీద పడి తిరుగుతూ వుంటే గౌరయ్యకూ నాకూ మధ్య స్నేహబంధం రాకపోకలు అంతంత మాత్రంగానే ఉండిపోయాయి.

ఇలా మళ్ళీ మా ఇంటికి వచ్చి రామం అనునయించడంతో మాతోబాటు గౌరయ్య కూడా బరైలీకి ప్రయాణమవడం తటస్థించింది. అయితే తండ్రి మీద కొడుకు కాస్త పట్టు సాధించాడనే చెప్పాలి. ఊరు విడిచి అంత సులభంగా కొండల్లోకి ప్రయాణానికి సరే అంటాడని నేను ఊహించలేదు.

మాశ్రీను స్టేషనుకొచ్చి మా ముగ్గుర్నీ తన క్వార్టర్స్‌కి తీసుకువెళ్ళాడు. కానీ వాళ్ళ ఆఫీసులో ఆడిట్ జరుగుతున్న కారణంగా అనుకున్నట్టుగా శలవు మర్నాటి నించీ దొరకలేదు. "రేపు ఉదయం బస్సులో గౌరయ్య అంకుల్ని తీసుకుని మీరు వెళ్ళండి. నేను అమ్మతో కలిసి , నాకు మూడు నాలుగు రోజుల్లో శలవు దొరకగానే వస్తాను. రామం వచ్చి బస్సులోంచి దింపుకుని మీ ఇద్దర్నీ వాళ్ల క్యాంప్‌కి తీసుకు వెళ్తాడు. నిన్ననే నాతో ఫోన్లో మాట్లాడాడు " అంటూ మా మర్నాటి ప్రయాణాన్ని స్థిరపరచి చెప్పాడు. సరే అనక తప్పలేదు.

సమతలం మీద టణక్‌పూర్ దాకా సాగిన ప్రయాణం ఆ తర్వాత నుంచీ ఎత్తుకెక్కుతూ పోయింది. ఆ అరోహణ పర్వంలో బస్సు మెలికలు తిరిగినపుడు గౌరయ్య సణుగుతూ కొడుకు మీద అక్షింతలు వేస్తూనే ఉన్నాడు.

చంపావత్ లోహఘాట్ లాంటి పెద్ద పట్నాలను మినహాయిస్తే ఘాట్ రోడ్డు పొడుగునా కనిపించే గ్రామాలు చిన్నవే. ఇళ్ళూ వాకిళ్ళూ చిన్నవైనా సిమ్మెంటు నాగరికత వాసన కనిపిస్తోంది. ఘాట్ రోడ్డుకి దూరంగా కొండల వార కనిపించే చిన్న చిన్న పల్లెల్లోని ఇళ్ళు ఏ షోకులూ ఎరగని పాకలు, పర్ణశాలలుగానే కనిపిస్తున్నాయి. పైన్ వృక్షాలు, టేకు, అడవి బూరుగులు నిటారుగా పెరిగి దారి పొడగునా సైనిక వందనం అర్పిస్తున్నట్లు పచ్చగా దర్శనమిస్తున్నాయి.

గడ్డాలు పెంచుకొని పచ్చని గడ్డి పుష్కలంగా మేసి బలంగా పెరిగిన మేకల మందలు అక్కడక్కడ అడ్డం రావడం వల్ల బస్సుని నెమ్మదిగా నడపవలసి వస్తోంది. మధ్యాహ్నం పన్నెండు దాటుతూ వుంటే రోడ్డులో ఒక పాయ కుడివేపుకు చీలింది. తిన్నగా పోతే అల్మోరా వస్తుందని బోర్డు సూచిస్తోంది. బస్సు కుడివేపుకు పోతోంది. అల్మోరా పేరుచదవగానే జాకిర్ హుస్సేన్ కథలో చాందినీ అనే మేక గుర్తొచ్చింది. అల్మోరా నేపథ్యంలో రాసిన గొప్ప కథ. దాని హిందీ అనువాదం మా కేంద్ర ఉద్యోగులకు హిందీని ఆఫీసులో నేర్పే క్లాసుల్లో చదివించారు. అబ్బుఖాన్ అనే వృద్ధుడు పెంచుకుంటున్న మేక ఒక రోజు ఈ కట్టు తెంపుకుని స్వేచ్ఛగా ఒక్కరోజు బ్రతికినా మేలు అని హాయిగా అడవిలోని అందాలు చూసి రాత్రి ఒక తోడేలుతో హోరాహోరి పోరాడి దాని వాత పడుతుంది. స్వాతంత్ర్యం విలువను తెలిపే ఆ కథ జ్ఞాపకం వస్తూనే ప్రక్కనున్న గౌరయ్యను తట్టి ఉత్సాహపరచాలన్న ఉద్దేశ్యంతో – "మన హిందీ క్లాసులో చదివిన అబ్బు ఖాంకీ బక్రీ కథ గుర్తుందా ?" అని అడిగాను. " ఏదో తప్పని తద్దినం లాగా పోయి చదివిన హిందీ క్లాసులోని పాఠం ఇంకా గుర్తుంచుకోవడం కూడానా ?" అన్నాడు తన చేతి గడియారాన్ని చూస్తూ.

బస్సు డ్రైవర్‌కి కుమావ్ ప్రాంతం కొట్టినపిండిలా ఉంది. దగ్గరగానే ఉన్న మాతో, ప్రాంతీయ యాసతో హిందీలో అప్పుడప్పుడు ఏదో అంటున్నాడు. కాస్త కష్టం మీద కొంత కొంత అర్థమౌతోంది. వానలు మొదలయ్యాక కొండ చరియలు విరుచుకు పడ్డం గురించీ రోడ్లు మూసుకుపోవడం, గ్రామాలు తుడుచుకుపోవడం గురించి పాత ముచ్చటలు చెప్తున్నాడు. మొదట్లో అల్మోరా చాలా పెద్దజిల్లా అనీ తర్వాత విడగొట్టి అందులోంచి పిథోరాగడ్ జిల్లాని సృష్టించారని చెబుతున్నాడు. నైనిటాల్ చాలా బాగుంటుందని వర్ణిస్తున్నాడు.

బస్సు ఆగగానే రామం ఆత్రంగా వచ్చి మా ఇద్దరినీ దింపి సామానుతో పాటు కారులో ఎక్కించుకుని – ఇంకా ముందుకుపోయి సైనికోద్యోగుల నివాసాల మధ్య తన క్వార్టర్స్ ముందు ఆపాడు. అక్కడి వాతావరణం, పచ్చదనం, అందం చూసి మురిసిపోయాను. తలచుకుంటే సైనికాధికారులు చెయ్యలేందేముంది. అటు చూసినా కొండ ఇటు చూసినకొండ– ఎటు చూసినా

కొండల దొంతరలు, లోయలు. కొన్ని కొండల్ని లోయల్నీ కలుపుకుంటూ ఫెన్స్‌లువేసి, మంచి రహదారులు వేసుకుని అందంగా ఒక సైనిక స్థావరంగా ఆ ప్రాంతాన్ని మలుచుకున్నారు. బొమ్మల కొలువు పెట్టుకునే పండగల్లో మెట్లు మెట్లుగా కొండ చరియల మీద నివాసాలు, కార్యాలయాలు, పార్కులు, పిల్లల స్కూళ్ళు కట్టుకుని ఆ మెట్లను కలుపుతూ అడ్డుదార్లుగా చిన్న చిన్న సావంచాలు నిర్మించుకున్నారు. ఇళ్ళ ముందు కూడా లాన్స్. అందులో రకరకాల పూల చెట్లు. రాముా క్వార్టర్స్ వెనుక కొండమీద ఏదో దేవత మందిరం ఉంది. ఆ మందిరం మీద కాషాయ రంగు జెండా రెపరెపలాడుతోంది. ఆ గుడి కామాఖ్య (కామాక్షి) మందిరమట.

స్నానాలు అయినాక ఒక యువకుడు మాకు కంచాలు పెట్టి వడ్డించాడు. భుక్తాయాసంతో గౌరయ్య నడుం వాల్చి మంచం మీద పడ్డదేపాటుగా నిద్రతీసాడు.

ఎత్తుకి రావడం కారణంగా ఆలోచనలు తేలిక పడినట్టనిపించింది నాకు. నిద్ర రాలేదు, రామం టేబుల్ మీద పుస్తకాలు అటూ ఇటూ త్రిప్పి చూస్తున్నాను, వాటిని నేను ఆసక్తితో చూడ్డం గమనించిన రామం నాకు దగ్గరా వచ్చి " ఈ పుస్తకాలు ఈ మధ్యనే మా యూనిట్ లైబ్రరీ నుంచి తీసుకొచ్చాను. చూడండి " అన్నాడు. కుమావ్ అడవులు, చెట్లూ చేమలు, మృగాలు, గ్రామీణుల ఆచార వ్యవహారాలు, అలంకారాలు, పండుగలు గురించి బొమ్మలతో విపులంగా వివరించిన పుస్తకాలవి. రామం అభిరుచికీ కలుపుగోలు స్వభావానికి సంతోషిస్తూ వుంటే మాకు భోజనం వడ్డించిన యువకుడు – ఒక విధమైన యాసతో ఏదో చెప్పి నమస్కరించి వెళ్ళి పోయాడు.

" ఆ యువకుడు లిప్‌స్టిక్ పెదవులకు వేసుకుని బుగ్గలకు ఆడపిల్ల లాగ గులాబీ రంగు అద్దుకున్నాడెందుకూ ?" అని అడిగాను. మగ పిల్లలకు అంత అలంకరణ ఎందుకని ఆశ్చర్యపోతూ .

"అది అలంకరణా లిప్‌స్టిక్కూ పౌడరూ కాదు అంకుల్, మనం తూర్పు కనుమల్లోనూ దక్షిణ ప్రాంతంలోనూ చూసే కొండ జాతులవాళ్ళు నల్లగా ఉంటారు. ఈ ప్రాంతంలో కొండ జాతి యువతీ యువకులు తెల్లటి వర్ణం, ఎర్రని పెదవులతో ఉంటారు. అది సహజ సౌందర్యమే."

" వాడిందాకా నీతో ఏదో అన్నాడు. ఆహిందీ మాట సరిగ్గా అర్థమే కాలేదు" అన్నాను.

" వాళ్ళ బంధువుకి పెళ్ళిట, రేపటి నుండి రెండురోజులు శలవుకావాలి, నే రాలేనని చెప్పాడు."

మీ సైన్యంలో వీడు సిపాయి కటూ ?

" కాదు కాదు. సిపాయిలు తీరిక సమయంలో వచ్చి మాకు చిన్న చిన్న సహాయాలు చేస్తూ వుంటారు, నిజమేకానీ వీణ్ణినాకు వంట చేసి పెట్టడానికి నేనే నెల జీతం మీదపెట్టుకున్నాను. ఒక నెల నుండీ నా వెనక పడి మీ ఇంట్లో పని చేస్తానంటున్నాడు. సరే అన్నాను సైనికాధికారుల దగ్గర పని చెయ్యడం వీళ్లకి ప్రతిష్ఠాకరం అన్నమాట. ముందు ముందు సైన్యంలో చేరే అవకాశం ఉంటుంది. అనుభవం వస్తుందని ఒక నమ్మకం...వీడికో చెల్లెలుంది. వీడికన్నా అందంగా తెల్లగా ఉంటుంది. ఇద్దరూ కవలలు, అప్పుడప్పుడు వీడితో మాట్లాడడానికి వస్తూ వుంటుంది ." అన్నాడు రామం వివరంగా.

కాసేంత నిద్ర పూర్తి చేసి లేచి కూర్చున్నాడు గౌరయ్య. ఇంటిపై కప్పు వేపు చూస్తూ "ఇన్ని హంగులున్న ఇంటికిపంకాలు లేవెందుకురా రామూ" అని ధర్మ సందేహం వెలిబుచ్చాడు. రామూ నవ్వుతూ " ఇప్పుడు నీకు ఫాన్ కావలంటే పెడస్టల్ తెప్పిస్తానో"న్నాడు.

అబ్బే – " ఇప్పుడు చల్లగానే ఉందిలే, కానీ ఎండాకాలంలో వద్దూ ?"

" ఇది మే నెల, ఇప్పుడు నీకు ఫాన్ అవసరం లేనప్పుడు ఇక సంవత్సరంలో ఎప్పుడూ అవసరం ఉండదు. ఇది హిల్‌స్టేషన్ నాన్నా" అని సందేహ నివృత్తి చేశాడు. అంతేకాదు, అక్కడ గోడలో ఉన్న కంతను చూపిస్తూ చలికాలంలో నిప్పు రాజేసుకుని దానికి దగ్గరగా కూర్చోవలసి వస్తుందని వివరించాడు.

"సాయంత్రం అలా మీ ఇద్దర్నీ అ కొండ అంచుదాకా తీసుకెళ్లి చూపిస్తా" అని రామూ అనబోతూ వుంటే ఎవడో సిపాయి వచ్చి కాగితం ఇచ్చి వెళ్ళాడు.

" నాకు ఇవాళ ఎక్కడికీ వచ్చే ఓపిక లేదురా రామూ" అని గౌరయ్య అడ్డు తగిలాడు.

"ఇవాళ సాయంత్రం ఏదో పార్టీ ఉంది నేను వెళ్ళాలి. రేపు సాయంత్రం మనమంతా కొండదాకా వెళ్దాం" అని రామూ అనడంతో ఒక బాధ తప్పినంతగా నిట్టూర్చాడు గౌరయ్య.

ఆ రాత్రి భోజనాలు పూర్తియినాయి. గౌరయ్య నిద్రపోతున్నాడు. పార్టీకి వెళ్ళిన రామూ ఇంకా దీపకాంతిని వీధి దీపాలు వెదజల్లుతున్నాయి. ఆవాడంతా ప్రశాంతంగా నిద్రలోకి జోగుతోంది.

దూరాన కుక్కలు మొరుగుతున్నాయి. దానికిప్రతిస్పందనగా రామూ క్వార్టర్స్‌కి దగ్గరాగానే ఉన్న వీధి కుక్కమొరిగింది. ఆ అరుపుల్ని ఏ మాత్రం లక్ష్యం చెయ్యకుండా నిశ్చింతగా రెండు తోడేళ్ళు పోతున్నాయి. నా ఒళ్ళు జలదరించినట్టు అయింది. గౌరయ్య మేల్కొని ఉండకపోవడం

మంచిదే అనుకున్నాను.

మరుసటి రోజు వేకువనే చెట్లమీద పిట్టల సందడికి లేచి వీధి గుమ్మంలో నిలుచున్నాను. పాల కోసం పాత్రలు పట్టుకని సహాయకుల సంచారం కనిపిస్తోంది. లాన్స్‌లో గార్డెన్ కుర్చీ వేసుకుని కూర్చున్నాను. ఆ ప్రశాంత ప్రభాతంలో కళ్లముందు కదలాడే అందాలని చూస్తూ వుంటే రాత్రి తోడేళ్లు గురించి ఆలోచన దూరమైంది. చింతలు వంతలు ఎక్కడకో పోయాయి.

విచ్చుకున్న రంగురంగుల పూలలోనికి సన్నని ముక్కులు జొప్పించి సున్నితంగా తేనె పీల్చుకుంటున్న చిన్నపిట్టలు, ఆపకుండా శ్రావ్యమైన సందడి చేస్తున్న బుల్‌బుల్ పిట్టలు, మైనగోరలు, చూస్తున్న నా దృష్టి వింత పక్షి మీద పడింది. పక్షి చిన్నదే కానీ తుర్రున కొమ్మ మీంచి కొమ్మ మీదికి ఎగిరేటప్పుడు పొడుగ్గా వున్న సన్ననితోకను గాలిలో తేలుస్తూ వుంటే ఇలాటి పిట్ట మన ప్రాంతంలో కనపడదే అని చూస్తున్నాను.

"ఆ పక్షి వింతగా ఉందని చూస్తున్నారా అంకుల్! దాన్ని పారడైజ్ ఫ్లైకేచర్ అంటారు. తెలుగులో ఏమనాలో " అంటూ నా వెనకనే నిలబడ్డ రామూని చూశాను. ఆలివ్ గ్రీన్ దుస్తుల్లో అందంగా హుందగా భుజకీర్తులతో సహా నిలబడ్డాడు.

"నేవెళ్లి మధ్యాహ్నం భోజనాల వేళకు వస్తాను. ఉదయం విశ్రాంతి తీసుకొండి, సాయంత్రం అలా హేపీవాలీ మీదుగా కొండల దగ్గరకి వెళ్దాం" అంటూ ఆర్మీ వాహనంలో వెళ్లిపోయాడు. ఇంట్లో పనికి వచ్చిన యువకుడికి ఏవో బాధ్యతలు అప్పగించాడు.

రోజూ చూడ్డానికి అలవాటు పడ్డ ప్రకృతికి ఎంతో భిన్నంగా ఉన్న దృశ్యాల్నీ, కొండల్నీ కోనల్నీ దూరాన్నుంచి చూస్తూ వుంటే పిల్లల కోలాహలం ఒక్కపెట్టున వినిపించింది. నాలుగడుగుల ఇంటి ముందువేసి క్రింద రోడ్డుని కలిపే పావంచాలపైన నిలుచున్నాను. స్కూలు గేటు దగ్గరకు నాలుగైదు పెద్దవాహనాలు నలువేపుల్నించీ అప్పుడే వీడిన పుష్పాల్లా ఉన్న పిల్లల్ని తెచ్చి అతి సున్నితంగా వాగ్దేవికి పూజ చేస్తున్నట్లు వొలకపోస్తున్నాయి. చిన్నపాటి గాలి తరగకే కిలకిల నవ్వినట్లు పల్చని ఆకుల్ని ఊపుతూ పోప్లర్ చెట్లు స్పందిస్తున్నాయి.

కొండల్లో ఎత్తులు ఎక్కి దిగడం అతి సధారణ జీవన సరళి కావడంతో స్థానికంగా ఉండే మనుష్యులు స్థూలకాయంతో కనపడ్డం లేదు. పచ్చని వెదురులా ఉండి అవలీలగా వీపున బరువులు మోసుకుంటూ తిరుగాడుతున్నారు. తల్లులు చంటి వాళ్లను కూడా వీపుకి కట్టుకుపోవడం, నిశ్చింతగా ఎత్తులు ఎక్కి దిగడం చూస్తే ముచ్చటగా ఉంది.

రామం రాగానే మధ్యాహ్న భోజనాలు ఆ తర్వాత విరామం పూర్తయింది. తర్వాత నాలుగ గంటల వేళ నా ముందుకు ట్రేలో వేడిగా టీ కప్పు పెట్టుకుని వచ్చి నిలబడ్డ యువకుడిత్ర నీపేరేమిటని అడిగాను.

" రాజేందర్‌సింగ్ " అన్నాడు.

" రాజేంద్రసింగువా ?" అన్నాను. "కాదు రాజేందర్" అన్నాడు.

పాపం ! వ్యాకరణాలు సంధులతో వాడికేం పని ? వాడి పేరుకి నేను న్యాయం చెయ్యడం లేదనుకున్నాడేమో .

" మీది ఏవూరు ?"

ఎన్నో సౌజ్ఞలు, చేతి ఊపుల సహాయంతో వాడి యాసలో మాట్లాడిన హిందీ భాషతో నాకు అర్థమైంది కొంతే. ఎదురుగా కనపడే ఎత్తైన కామాఖ్య కొండ ఎక్కివెనక్కు ఇంకో కొండ వేపువెళ్తే వాడి ఊరు వస్తుందట. అక్కడికి ఏ చక్రాల బండితోనూ ఎకాఎకీ వెళ్లడం సాధ్యం కాదు కాబట్టి నడిచే వెళ్ళి రావాలని చెప్పాడు. రెండు రోజుల పాటు శెలవు తీసుకున్నాడట. ఇంకో అర్థగంటలో బయలు దేరి వెళ్ళిపోతాడట. మేజర్ సాబ్ దోస్తు ఎవరో ఇంకో మనిషిని అంత దాకా పంపుతానన్నాడట. వాడెవడో మాకు భోజనం ఏర్పాటు చేస్తాడట, గబ్బర్‌సింగ్ వినయంగా మాట్లాడే ప్రయత్నం చేస్తే ఎలా ఉంటుందో అలా ఉంది వాడి భాష.

ఒక గంటలో ఎక్కడి నుంచి వచ్చి పడ్డాయో కానీ చిక్కగా మేఘాలు వచ్చి పెద్దగా ఉరిమి "అకాలమేమీకాదు . ఇక వచ్చేది వానకాలమే సుమా "అని చెప్తూ అప్పుడప్పుడు ఇలా జల్లులు వస్తాయి- అన్నాడు రాము. ఒక అర్థగంట కురిసిన జల్లుకి కొండలూ, వీధులూ కడిగిన ముత్యాల్లా ఎండలో మెరిసి అంతలోనే వాతావరణం పొడిగా నిర్మలంగా మారిపోయింది. అలా కొండవార దాకా పోయి వద్దాం అని రామం బయల్దేరించడంతో నేనూ గౌరయ్యాకారులో కూర్చున్నాం.

కారు పోగలిగినంత దూరం నడిపి, కొండకు దిగువగా విడిచి తాళం వేశాడు. కాసింత దూరం అలా ఎత్తుకెక్కి వద్దాం అన్నాడు రామూ. కాస్త వెనకబడుతున్నా గౌరయ్య మాతో సహకరిస్తున్నాడు. అక్కడక్కడ చీపురు గడ్డిపొదలు, దూరదూరంగా చెట్లూ ఉన్న ఆ కొండచరియ నిర్మానుష్యంగా ఉంది. చేతి గడియారం చూశాను. ఐదు కావస్తోంది. "చీకటి ముసురుతోందిరా రామూ ! పోదాం "అన్నాడు గౌరయ్య కష్టపడి ఎత్తుకెక్కుతూ

సన్నాయి మేళం వినిపించింది. మాకెదురుగా ఒక పెళ్ళివాళ్ళ పార్టీ వచ్చి మమ్మల్ని

దాటుకుంటూ ముందుకు క్రిందకి ఏదో గ్రామం వేపు వెళ్ళి పోయింది. ఇద్దరు సన్నాయి ఊదుకుంటూ ముందు నడుస్తున్నారు . సారె సామాన్లు, పాత్రలు పట్టుకుని కొందరు వెనుక వస్తున్నారు: మధ్యలోనే నలుగురి మధ్య వధూవరులు పెళ్ళి అలంకరణతో నడుస్తున్నారు. అంతా కలిపి పది పదిహేనుమందికి మించి ఉండరు. ఏదో ఆలోచిస్తూ వుంటే "చీకటిముసిరింది మనమూ వెనక్కుపోదాముర రాముూ !" అన్నాడు గౌరయ్య ఇంకోమారు విసుగ్గా .

ముందు రాత్రి కిటికీలోంచి నే చూసిన తోడేళ్ళ దృశ్యం గురించి గౌరయ్యతోచెప్పలేదు. రాముూకి చెప్పాలనుకున్నాను, కానీ హడావిడిగా డ్యూటీకి వెళ్ళిపోతూ వుంటే తర్వాత చెప్పొచ్చని వాయిదా వేశాను. ఇపుడు మళ్ళా జ్ఞాపకం రావడానికి అక్కడ నిర్మానుష్యంగా ఉన్న కొండల దొంతరలు కారణమని చెప్పక్కర్లేదు. గౌరయ్య ప్రతిపాదనకు వంత పాడాలి నేను కూడా అనుకుంటూ వుండేలోగా కొండ మీంచి ఇద్దరు ఎదురొస్తున్నారు. దగ్గరకు రాగానే ఆశ్చర్యపోయాను. పద్నాలుగేళ్ళ ప్రాయపు అమ్మాయి, సుమారు ఇరవై ఏళ్ళకు అటూ ఇటూ వుండే పడచు పిల్ల. ఎంత ధైర్యం అని మనసులో అనుకున్నాను.

రాముూ వాళ్ళని పలకరించాడు. వడిగా నడిచి వస్తున్న కారణంగా ఆయాసపడుతున్న పెద్దపిల్ల హిందీలో వాళ్ల యాసతో ఏదేదో చెప్పింది. వెళ్ళిపోతూ ముత్యాల కోవలాటి పళ్లు మెరుస్తూ వుంటే ఎంతో హాయిగా నవ్వుతూ మొలలో ఉంచిన చిన్న కత్తిని చూపుతూ వడిగా ముందుకు సాగింది. ఆమెతో, చిన్నపిల్ల చరచరా వెళ్ళిపోయింది. గౌరయ్య అయోమయంగా చూస్తూ "ఏమంటుంది ఆ కత్తి ఎందుకూ ?" అన్నాడు నాకూ ఆ సందేహం రానే వచ్చింది. రామం చెప్పేది వింటున్నాను.

" ఇందాక వెళ్ళిన పెళ్లివాళ్లు ఈ లోయ దిగి బడకటియా గ్రామం వెళ్తున్నారట. వీళ్లు ఇద్దరూ ఏదో పని వల్ల కాస్త వెనకబడితే వీళ్లని కూడగట్టుకుపోవడం మరచిపోయారట. వాళ్లని కలుసుకుందుకు తొందరగా వెళ్తున్నారు. ఆ పెద్దమ్మాయి మన ఇంట్లో పనిచేసే రాంబీదర్‌తో పుట్టిన కవల. రెండో అమ్మాయి వాళ్ళ బంధువుట.

రోజూ వార్తాపత్రికల్లోని అరాచకాలు జ్ఞాపకం వచ్చి ఆ విషయం ప్రస్తావించడం ఇష్టంలేక, వాళ్ళకి - తోడేళ్లో చిరుతలో మీదపడి పీక్కుతింటాయన్న భయం లేదూ అని నేనడిగాను.

నేనూ ఆ పెద్దపిల్లను అదే అడిగాను. కొండల్లో పుట్టి పెరిగి రోజూ కర్రా, కంపా ఏరుకునే వీళ్ళకి జంతువుల నైజం మీదగట్టి నమ్మకం. అవి వాటికి సహజంగా ప్రకృతి చూపే జంతువుల్నే ఆహారంగా వెతుక్కు వేటాడతాయి కానీ మనుష్యుల జోలు పట్టవట. ఎప్పుడైనా అనుకోకుండా వచ్చి పడితే అది ఊహించని దురదృష్టమనుకుంటారట. అందుకని

రోజా తినడం – తిరగటం మానుకుంటామా ? చిన్న కత్తి మొల్లో ఉంచుకుంటామని చెప్పింది ఆ వివరణ వినగానే భయమెరుగని నవ్వులో అసాధారణమైన నైర్మల్యం ఉంటుందేమో అనిపించింది నాకు.

మేం కూడా కొండచరియ దిగి క్వార్టర్స్‌కి వచ్చేశాం. భోజనాల తర్వాతబాగా అలసట కారణంగా గౌరయ్య త్వరగా నిద్రపోయాడు. నేను టి.వీలో చొరబాటుదార్ల వార్తలు వింటున్నాను. వీథిలో ఏదో వాహనం వచ్చిన శబ్దం. రాము వెళ్లి ఎవరితోనో మాట్లాడివచ్చాడు. రాత్రి చాలాసార్లు టెలిఫోన్ మ్రోగింది. రాము హడావిడిగానే ఉన్నాడు.

ఉదయాన్నే జీప్సీ బండి వచ్చి ఆగింది. " నాన్నా! నాకు పదిరోజులు స్పెషల్ డ్యూటీ పడింది. మధ్యాహ్నం నే వెళ్ళిపోవాలి. నువ్వూ అంకులూ ఈ జీప్సీలో బరైలీ వెళ్ళిపొండి. నే వచ్చాక మళ్ళా వద్దురుగాని..... " అని గౌరయ్యతో చెబుతూ నావేపు అర్థవంతంగా చూసి మాకు వీడ్కోలుగా చేతులు ఊపాడు. మా బండి కదిలిపోయింది.

ముందురోజు రాత్రి నే పడుకోబోతూ వుంటే రాము నాకూ దగ్గరగా వచ్చి "అంకుల్! మా నాన్న కంగారు పడకుండా మీరు జాగ్రత్తగా బరైలీ తీసుకు వెళ్ళిపోగలరని నమ్మకం నాకు ఉంది. ఇదిమేం ఊహించని పరిణామం. నేనూ మరో పదిమంది ఆఫీసర్లూ మా సహాయకులతో కలిసి జమ్మూ వెళ్ళి రిపోర్ట్ అవ్వాలి" అని నేను పరిస్థితిని అర్థం చేసుకోగలనన్న ధైర్యంతో నవ్వాడు. విచిత్రమైన ఆ నవ్వులోని తాత్త్విక నైర్మల్యం ఇప్పటికీ నన్ను ఆశ్చర్యపరుస్తూనే ఉంది. చిన్న వయసులో అలా కర్మయోగిలా నవ్వడం ఎలా సాధ్యం? అదే నన్ను పదేపదే కదలించే ప్రశ్న. సరిహద్దు రక్షణ బాధ్యతల్లోని వేడికి కరగిపోయిన ఆ నవ్వు – నామనసులో శాశ్వతంగా నేటికీ నిలిచి పోయింది.

– జాగృతి దీపావళి ప్రత్యేకసంచిక,నవంబర్ –1 4, 1999